క్లుప్తంగా

ఓటరు నమోదు బాధ్యత మీదే

- చనిపోయిన వారి పేర్లను తొలగించాలి
- బీఎల్‌ఓలతో తహసీల్దార్



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

మోమిన్‌పేట: అర్హత కలిగిన వారిని ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే అని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు. చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు వారి కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం పనికి రాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, బీఎల్‌ఓలు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు



బుద్ధారం పంచాయతీ కార్యాలయం

పెద్దేముల్: గ్రామాల్లో సీసీ, మెటల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధిహామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్)కింద నిధులు మంజూరు చేసింది. మండల పరిధి అడ్కిచెర్ల, ఆత్కూర్, బాయిమిదితండా, బండమీదిపల్లి, బండపల్లి, బుద్దారం, చైతన్యనగర్, దుగ్గాపూర్, ఎర్రగోడుతండా, గోట్లపల్లి, హన్మాపూర్, జనగాం, జైరాంతండా, కందనెల్లితండా, ఖానాపూర్, కొండాపూర్, మారేపల్లితండా, పాషాపూర్, సిద్ధన్నమడుగుతండా, తట్టెపల్లి, గాజీపూర్, గిర్మాపూర్, గోపాల్‌పూర్ తదితర గ్రామాలకు రూ.5లక్షలు, మరి కొన్ని జీపీలకు రూ.10లక్షల చొప్పున నిధులు కేటాయించిందని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

తాండూరు టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపాన అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేసి, ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, కౌన్సిలర్ శ్రీలత, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తిప్పయ్య, కార్యదర్శి మురళీకృష్ణ, సభ్యులు నర్సింహులు, చంద్రశేఖర్, ఎల్లయ్య, నరహరి, సతీష్, వసంత్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మహాపడిపూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

పూడూరు: మండల పరిధి ఎన్కేపల్లి అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమ్రోగింది. శుక్రవారం గ్రామానికి చెందిన అయ్యప్పచారీ స్వామి నిర్వహించిన మహాపడిపూజలో అధిక సంఖ్యలో భక్తులు, మాలదారులు పాల్గొని పూజలు చేశారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల విద్యార్థులకు నల్లకంచెలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తోలుకట్ట చేవెళ్ల గురుకులం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణం, వనరులు తదితర అంశాలపై జరిగిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు అమూల్య, కృష్ణాక్షయ పర్యావరణ అధ్యయనం, సుస్థిరాభివృద్ధి అనే నమూనాను ప్రదర్శించి తృతీయ బహుమతి అందుకున్నారు. విద్యార్థులను ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రిన్సిపాల్ అభినందించారు.

నిప్పుతో.. నిస్సారం

వ్యవసాయంపై ఆధారపడిన రైతులు.. భూసారం కోల్పోకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలి. కానీ అవగాహనా రాహిత్యంతో నష్టపోతున్నారు. సిరులు పండించే భూమికి బలమే ఆయువు పట్టు. అంతటి ప్రాధాన్యత కలిగిన భూసారాన్ని కాపాడుకుంటేనే మంచి దిగుబడులు సాధ్యం.

- వరి కొయ్యలను కాల్చడం అనాలోచిత చర్య
- కలియ దున్నితే మేలు
- సేంద్రియ ఎరువుగా మారే అవకాశం
- వ్యవసాయ అధికారుల సూచన

దోమ: 'పంట కోత తరువాత మిగిలిన వరి కొయ్యలకు నిప్పు పెట్టడం నేడు సహజంగా మారింది. అలా కాల్చడం వలన రైతులకు ప్రయోజనం ఉండదు. ఈ చర్యలతో భూమి వేడెక్కి భూసారం కోల్పోయే ప్రమాదం ఉంది' అని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటిని కాల్చకుండా కలియ దున్నితేనే రైతులు మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. గతంలో వరిని కొడవళ్లతో మొదళ్ల వరకు కోసేవారు. అలా కోసిన గడ్డిని పశువులకు పశుగ్రాసంగా వినియోగించేవారు.

యంత్రాలతో కోతలు

మండల పరిధిలో అత్యధికంగా రైతులు వరిని సాగు చేస్తారు. యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎక్కువగా వాటినే వినియోగిస్తున్నారు. వరిని యంత్రాలతో కోయించడం వలన పొలంలో కొయ్యలు పెద్దగా మిగిలి పోతున్నాయి. దీంతో దుక్కిదున్నే సమయంలో కొయ్యలు నాగళ్లకు అడ్డుగా వస్తాయనే ఉద్దేశంతో వాటిని, గడ్డిని సైతం పొలంలోనే నిప్పంటించి కాల్చి బూడిద చేస్తున్నారు. ఇలా చేయడం వలన భూమిలో వేడి పెరిగి, భూసారం కోల్పోయేలా చేస్తుందని అధికారులు చెబుతున్నారు. అంతే కాదు.. పశువులను గ్రాసం కొరత ఏర్పడుతుంది.



పొలంలోని వరి కొయ్యలకు పెట్టిన నిప్పు

సేంద్రియ కర్బన పదార్థాలతో పాటు..

ఒక హెక్టారు భూమిలోని వరి పైరు అవశేషాలు, వ్యర్థాల (కొయ్య కాళ్లు, వేరు దుబ్బులు)ను తగలబెట్టడం ద్వారా సుమారు 3 నుంచి 4 వేల రూపాయల విలువ గల 30 నుంచి 40 కేజీల నత్రజని, 20 నుంచి 30 కిలోల ఫాస్పరస్, 40 నుంచి 80 కేజీల పొటాషియం, 4 నుంచి 6 కేజీల గంధకం, 1200 నుంచి 1300 వందల కిలోల సేంద్రియ కర్బన పదార్థంతో పాటు, అనేక సూక్ష్మపోషకాలను భూమిలో నష్టపోవాల్సి వస్తుంది. దీంతో భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు తగ్గుముఖం పడతాయి. ఫలితంగా పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

కలియదున్నితే దిగుబడులు

వరి కొయ్యలను కాల్చడం కంటే.. వాటిని పొలంలో కలియదున్నడం వలన కలిగే ప్రయోజనాలే అధికంగా ఉన్నాయని, వాటిని రైతులు గమనించలేక పోతున్నట్లు తెలుస్తోంది. వాటిని దున్నడం వలన సేంద్రియ ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే రెండు వారాల్లో వరి కొయ్యలు, గడ్డి మొక్కలు త్వరగా మురిగి కుళ్లిపోతాయి. దీంతో కొయ్యలు మురుగుగా మారి ఎరువుగా తయారవడంతో పోషకాలు పెరిగి దిగుబడి పెరుగుతుంది. ఫలితంగా రసాయన ఎరువుల వాడకం తగ్గుముఖం పడుతుంది. నేలలో వరి కొయ్యలను కలియ దున్నడంతో ఎకరానికి సుమారు టన్ను ఎరువు తయారవుతుంది. దీంతో మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం భాస్వరం అదనంగా అందిస్తుంది. సేంద్రియ కర్బన శాతం పెరిగి 5 నుంచి 10 శాతం దిగుబడి పెరిగే అవకాశాలు ఉంటాయి.

తెలియకే కాల్చేస్తున్నాం..



యంత్రాలు అందుబాటులోకి వచ్చాక, వరి కోతలు కోసిన అనంతరం మిగిలిన కొయ్యలకు నిప్పు పెట్టి కాల్చి వేస్తున్నాం. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి పొందలేక పోతున్నాం. కొయ్యలను కాల్చడం వలన భూసారం దెబ్బతింటుందన్న విషయం మాకు తెలియదు. అందుకే బూడిదగా మారుస్తున్నాం. దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలి.

– బాబు, రైతు, బొంపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలను కాల్చకూడదని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కొంత మంది పంటను కోసిన తరువాత గడ్డిని, కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలా కాకుండా వాటిని భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి, భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఆశించిన స్థాయిలో దిగుబడి పొందవచ్చు.

– కావ్య, ఏఈఓ, దోమ క్లస్టర్

ఒక్కొక్కరికి రెండు ఓట్లు!

తొలగించాలని డీటీకి వినతి

కుల్కచర్ల: ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్యలు కోరారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుల్కచర్ల గ్రామపంచాయతీ 8వ వార్డులో ఇతర వార్డులకు చెందిన వ్యక్తులకు ఓట్లు ఉన్నాయని, అంతే కాకుండా ఒక్కో వక్తికి రెండు ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. చనిపోయిన వారి పేర్లు అలాగే ఉన్నాయని, వాటిని సవరించాలని కోరారు. కార్యక్రమంలో నీరటి కర్ణయ్య, కాటనిపల్లి మైపాల్, కొండ ఆంజనేయులు, మల్లేశ్, రాంచంద్రయ్య, బూరకొండ సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.



డీటీ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

రైతులు దళారులను ఆశ్రయించవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ పద్మ కోరారు. శుక్రవారం మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతు శ్రేయస్సు కోసం వారికి అందుబాటులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించవద్దని, దూర ప్రాంతాలకు పంటను తరలించకుండా.. సమీపాన ఉన్న కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నర్సింహులు, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సింహులు, రామయ్య, జంగం మల్లయ్య, బాలకృష్ణయ్య, చిన్నయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, చంద్రయ్య, మల్లయ్య, మొగులయ్య, పోచయ్య, శంకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డం.. ఆగమాగం

- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- కొరవడిన ట్రాఫిక్ రూల్స్.. ఇబ్బంది పడుతున్న ప్రజలు


కొడంగల్: రహదారికి ఇరువైపులా అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేతతో తోటి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రం అవుతోంది. పట్టణంలోని దుకాణ సముదాయాల్లో సరకుల విక్రయానికి వచ్చేవారు తమ వాహనాలను షాపుల ఎదుట ఇష్టానుసారంగా నిలిపి వేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. హైదరాబాద్–బీజాపూర్, చించోలి–బూత్పూర్ జాతీయ రహదారులు కొడంగల్ మీదుగా వెళ్తుండటంతో.. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో అంబేడ్కర్ కూడలి రద్దీగా ఉంటోంది.

ప్రధాన కేంద్రంగా కొడంగల్..

అటు హైదరాబాద్.. ఇటు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే వాహనాలతో పట్టణం కిక్కిరిసిపోయి ఉంటుంది. మున్సిపాలిటీగా మారిన తరువాత.. కొడంగల్ ప్రధాన కేంద్రంగా మారింది. బతుకు దెరువుకోసం చుట్టపక్క గ్రామాల నుంచి అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకోగా.. ఇంకొందరు అద్దె ఇళ్లల్లో జీవనం కొనసాగిస్తున్నారు. దీంతో ఇక్కడ జనసంచారం పెరిగిపోయింది. ఇంతటి రద్దీ ప్రాంతంలో వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించడం పోవటం గమనార్హం.

తరచూ ప్రమాదాలు

బస్టాండ్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌కు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే ఆపి వెళ్తుంటారు. హైదరాబాద్ వెళ్లే వారు అక్కడే నిలుపుతున్నారు. దీంతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని డ్రైవర్లు వాపోతున్నారు. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వినాయక చౌరస్తాలో ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు రద్దీగా ఉంటుంది. అనేక పాఠశాలలు, కళాశాలలు ఇక్కడే ఉన్నాయి. విద్యాలయాల సమయంలో వేలాది మంది విద్యార్థులతో జనసంద్రంగా ఉంటుంది. మహబూబ్‌నగర్, తాండూరు వెళ్లే బస్సులు ఈ కూడలిలోనే ఆపుతుంటారు. స్టేట్ బ్యాంకు, ఏపీజీవీబీ ఎదుట, అంబేడ్కర్ చౌరస్తా, కోస్గి రోడ్డులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది.



కొడంగల్ మెయిన్ రోడ్డుపై ఆగి ఉన్న వాహనాలు

పోలీసులు చర్యలు తీసుకోవాలి



పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనదారులు తమ వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా నిలిపేస్తున్నారు. వాహనాల రద్దీని నియంత్రించడానికి స్థానికంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. నిబంధనలు పాటించని వాహన దారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్, కొడంగల్

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

- పనికి తగిన వేతనం ఇవ్వాలి
- తపాలా సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్

దోమ: తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని సికింద్రాబాద్ డివిజన్ జీడీఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ డివిజన్ సభ్యులతో కలిసి బొంపల్లి తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీడీఎస్‌లకు పని ఒత్తిడిని తగ్గించి, సమాన పనికి సమాన వేతనంతో పాటు పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 2016లో గ్రామీణ తపాలా ఉద్యోగుల పరిస్థితి తెలుసుకునేందుకు నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన రిపోర్టును అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. 8 గంటల పని విధానం, పింఛన్‌తో పాటు తగిన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వికారాబాద్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆరీఫ్ పటేల్, బ్రాంచ్ కార్యదర్శి ప్రభు వెంకట్‌రెడ్డి, జీడీఎస్‌లు ఖమ్మర్‌పాష, వెంకటేశం, రమేశ్‌బాబు, రాజు, సుకన్య, అఖిల, శిరీష, నందిని, సాయివర్ధన్, అఖిల తదితరులు పాల్గొన్నారు.



తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జీడీఎస్‌లు

'కోట్‌పల్లి'ని మూయించిన మాజీ ఎమ్మెల్యే!

- ఆనంద్ కుట్రతోనే రోడ్డున పడిన కుటుంబాలు
- జలాశయానికి పర్యాటకులు వచ్చేలా చూడాలి
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు విన్నవించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేతలు

ధారూరు: సర్పన్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతం రిసార్టుల కోసం.. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అటవీశాఖ అధికారులతో చేతులు కలిపి, కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు రాకుండా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సభాపతిగా బాధ్యతలు చేపట్టిన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ నేతలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తలమానికమైన కోట్‌పల్లికి ఎవరు రాకుండా మాజీ ఎమ్మెల్యే.. జనవరిలో జలాశయం దారులను మూసివేయించారని స్పీకర్ దృష్టి తెచ్చారు. ఆయన కుట్రతోనే ఎంతో మంది ఉపాధి కోల్పోయారని విమర్శించారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. వారిని ఆదుకునేందుకు ప్రాజెక్టు దారులను తెరిపించి, పర్యాటకులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన స్పీకర్.. సంబంధిత అధికారులతో మాట్లాడి పర్మిషన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు ఇబ్రహీం, ఫజిల్, దాసు, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కాంగ్రెస్ నేతలు

'దళితబంధు'ను మరిచిన గవర్నర్

దోమ: అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేసిన ప్రసంగంపై బొంపల్లి ఎంపీటీసీ రాములు అసంతృప్తి వ్యక్తం చేశారు. దళితబంధు గురించి ప్రస్తావించక పోవటం బాధాకరమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఎంతో మంది దళితులు.. దళితబంధు ద్వారా లబ్ధిపొందారని తెలిపారు. గ్రామాల్లో దళితులు వెనుకబడి ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పిస్తూ వారి హక్కులను కాపాడాలని కోరారు. గవర్నర్ చేసిన ప్రసంగంలో కొత్తగా ఏమీ లేదని, కాంగ్రెస్ మేనిఫెస్టో చదివినట్లు ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో చెప్పనేలేదని మండిపడ్డారు.

విద్యార్థులు సరే.. ఉపాధ్యాయులేరి?

ఏడుగురున్నా.. విధుల్లో ఒక్కరే



ఉపాధ్యాయులు లేక పాఠశాల ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

దోమ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పిల్లలు తరగతి గదులు, పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలతో గడిపారు. ఈ సంఘటన మండల పరిధి ఐనాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ బడిలో మొత్తం 147 మంది విద్యార్థులు అభ్యసిస్తుండగా.. వీరికి ఆరుగురు ఉపాధ్యాయులు, ఒక పీటీ ఉన్నారు. వారిలో బ్రహ్మచారీ, సౌమ్యా అనే ఉపాధ్యాయులు పరిగిలో నిర్వహించిన శిక్షణకు వెళ్లగా.. నాగప్ప, ఎల్లారెడ్డిలు సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. మరో ఉపాధ్యాయుడు మల్లేశం విధులకు వస్తున్న క్రమంలో ఆయన అమ్మమ్మ మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. ప్రధానోపాధ్యాయుడి అనుమతితో ఆయన సెలవుపై వెళ్లారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో విద్యార్థులు ఆటపాటలతో గడిపారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు బడిని సందర్శించారు. పీటీ ఒక్కరే విధులు నిర్వహిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎంఈఓను వివరణ కోరగా.. విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు లీవ్‌లో ఉన్నారని, మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నతి శిక్షణకోసం వెళ్లినట్లు పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

పాఠశాలలో పరిశుభ్రత అవసరం

- సపాయి కార్మికులను నియమించాలి
- మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి: ఎంఈఓ
- నంబర్ వన్ బడిని సందర్శించిన విద్యాధికారి


సాక్షి ఎఫెక్ట్..

తాండూరు టౌన్: మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు సపాయి కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులను మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్ ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి 'ఇంటికి వెళ్లాకే అన్ని' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఎంఈఓ స్పందించారు. శుక్రవారం పాఠశాలను సందర్శించి, అక్కడి సమస్యల గురించి ఆరా తీశారు. మరుగు దొడ్లను పరిశీలించారు. సౌకర్యాల కల్పనలో విఫలమైన ఉపాధ్యాయ బృందంపై అసహనం వ్యక్తంచేశారు. అనంతరం దగ్గరుండి మూత్రశాలలను శుభ్రం చేయించి మాట్లాడారు. తరగతి గదులతో పాటు, బడి ఆవరణలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంచేయించాలని చెప్పారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సూచించారు.



మూత్రశాలలను శుభ్రం చేయిస్తున్న ఎంఈఓ వెంకటయ్య గౌడ్

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులు

కుల్కచర్ల: ప్రతిరోజు పాఠాలు వినే విద్యార్థులు.. శుక్రవారం తామే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి వారికి పాఠ్యాంశాలు బోధించారు. అంతారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి వారికి పాఠాలు చెప్పి, గురుతర బాధ్యత అనుభూతిని పొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయులు బాలకృష్ణ, క్రిష్ణయ్య, రమేష్, రోహిన్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఉత్సవాలు

బంట్వారం: మండల పరిధి బొప్పునారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో ఆలయ ప్రారంభోత్సవం, స్వామి వారి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరగనున్నాయని, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



స్వామివారి ఊరేగింపులో భక్తులు